వాయిస్ టుడే

హైదరాబాద్
మంగళవారం, 16 ఏప్రిల్ 2024

## నేడు మెతుకుసీమకు కేసీఆర్.. సుల్తాన్‌పూర్‌లో ప్రజాఆశీర్వాద సభ

**మెదక్, జహీరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్లలో ఎన్నికల శంఖారావం**

**సుల్తాన్‌పూర్ వేదికగా ప్రజాఆశీర్వాద సభ గులాబీదళంలో కదనోత్సాహం**

**సంగారెడ్డి జిల్లాలో నేడు కేసీఆర్ సభ**



### లక్షల మందితో సుల్తాన్‌పూర్‌లో బహిరంగ సభ

సంగారెడ్డి, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లాలో మంగళవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సుల్తాన్‌పూర్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు లక్షమందికిపైగా ప్రజలు హాజరవుతారన్న అంచనాతో బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి జనసమీకరణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు.

సభ నిర్వహించనున్న స్థలాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌తో కలిసి పరిశీలించారు. సభ ఏర్పాట్లపై వారికి పలు సూచనలు చేశారు. అనంతరం చింతా ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. బహిరంగసభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు వస్తున్న కేసీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు. సభలో హరీశ్‌రావుతోపాటు మెదక్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్, పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు పాల్గొననున్నారు.

### ప్రజా ఆశీర్వాద సభకు భారీగా జనసమీకరణ

సుల్తాన్‌పూర్‌లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేసీఆర్ ప్రసంగించనున్న నేపథ్యంలో భారీ వేదికను తీర్చిదిద్దారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ ప్రారంభం కానున్నది. కేసీఆర్ హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో పటాన్‌చెరు, సంగారెడ్డి మీదుగా సుల్తాన్‌పూర్ చేరుకుంటారు. కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి, గులాబీ జెండాలతో అలంకరించారు. బహిరంగసభ ప్రాంతంలో కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు, మెదక్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్ కటౌట్లను సైతం ఏర్పాటుచేశారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**కాంగ్రెసలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు**

కోనరావుపేట, ఏప్రిల్ 15: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట ఎంపీటీసీ దేవరకొండ చారి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేష్‌రెడ్డితోపాటు 50 మంది బీఆర్ఎస్ నుంచి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో కుటుంబ సభ్యులుగా కలిసి ఉంటారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో 14 మంది ప్రధాన మంత్రులు చేసిన అప్పు ఒక్కటైతే పది సంవత్సరాల మోదీ ప్రభుత్వ పాలనలో చేసిన అప్పు ఒక ఎత్తు అవుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి వెళ్లిన నాయకులు మళ్లీ పార్టీలో చేరుతున్నారన్నారు. వీరి ద్వారా పార్టీ మరింత బలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయలు ఎల్లయ్య, చందనగిరి గోపాల్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి ప్రభాకర్, పల్లె రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## ఇసుక ఎవరు దోచుకుపోతున్నారో చెప్పాలి

**మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించిన జడ్పీ చైర్మన్ పుట్ట మధు**

మంథని, ఏప్రిల్ 15: అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాత ముత్తాతల ఆస్తిలాంటి ఇసుకను దోచుకుపోతున్నారని మాట్లాడిన అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి ఈనాడు ఇసుకను ఎవరు దోచుకుపోతున్నారో ప్రజలకు జవాబు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు డిమాండ్ చేశారు. ఇసుక లారీల ఓవర్ లోడ్‌తో ఛిద్రమైన మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిని సోమవారం పుట్ట మధు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అనేక అబద్దాలు చెప్పిన మంత్రి ఈనాడు ఇసుక అక్రమ తరలింపుపై ఎందుకు స్పందించలేదన్నారు. మంత్రి ఎన్నికల్లో వంద కోట్లు ఎట్లా ఖర్చు చేశాడని, అంత పెద్ద డబ్బు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికారంలో లేనపుడు మరో రకంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఇసుక క్వారీలు, లారీలు తనవేనని ప్రచారం చేశారని, ఈనాడు వందల కొద్ది అక్రమంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలన్నీ ఎవరివని ప్రశ్నించారు. వంద టన్నుల బరువు వెళ్లినా చెదిరిపోకుండా రోడ్ల నిర్మాణం చేస్తే నాలుగు నెలలు గడవ ముందే వంద టన్నుల కంటే ఎక్కువ బరువుతో ఇసుక లారీలు వెళ్తున్నాయని, దీంతో రోడ్డు మొత్తం పగిలిపోతుందన్నారు. అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తే అక్కడక్కడ ఒకటి రెండు లారీలను పట్టుకుంటున్నారని, కానీ వందల కొద్ది లారీలు ఓవర్‌లోడ్ వెళ్తున్నాయని ఆరోపించారు. మంథని నియోజకవర్గంలో పదేళ్ల పాటు ప్రజలకు అనేక సేవలు, అభివృద్ధి చేసినా మూడు ఓట్లు లేని కుటుంబం ఇంత పెద్ద సమాజానికి మాయమాటలు, అబద్దాలు చెప్పి అధికారం చెలాయిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నీళ్ల కింద ఇసుక వృధాగా పోవద్దని, కేసీఆర్ సర్కార్ ఇసుక తీసి ప్రజల అవసరాలకు వినియోగించడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు డబ్బులు జమ చేసింద న్నారు. ఈనాడు మాత్రం ఇసుక క్వారీలు, లారీల డబ్బులు కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్తున్నాయని, నియోజకవర్గంలో ఇసుక, బియ్యం, స్క్రాప్, బెల్లం దందాలకు కాంగ్రెస్ నాయకులు ఇంచార్జీలుగా వ్యవహరిస్తే మంత్రి సోదరుడు నాయకత్వం వహిస్తున్నాడని ఆరోపించారు.

# ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఒడిదుడుకులు జాగ్రత్తగా సజావుగా వేగవంతంగా జరిగా చూడాలి

**- రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ కార్యదర్శి దేవేంద్ర సింగ్ చౌహాన్**



కామారెడ్డి బ్యూరో ఏప్రిల్ 15 వాయిస్ టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణ తీరు, మౌలిక సదుపాయాలు బాగున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ కార్యదర్శి దేవేంద్ర సింగ్ చౌహాన్ సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఒడుదుడుగులు లేకుండా సజావుగా, వేగవంతంగా జరిగేలా చూడాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు తెచ్చిన ధాన్యం తేమ శాతం పరిశీలించి కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన తేమ కొలిచే యంత్రాలు, గన్ని సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గోనెసంచుల కొరత లేదని స్పష్టం చేశారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా వ్యవసాయ, సహకార అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి,మద్దతు ధరపై రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. రెవిన్యూ, పౌరసరఫరాల, మార్కెటింగ్, వ్యవసాయ, ఐకెపి వంటి అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని చెప్పారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ చేపట్టాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా చూడాలన్నారు. వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కోరారు. ఎప్పటికప్పుడు రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ట్యాబులల్లో ఎంట్రీ చేసి సకాలంలో డబ్బులు అందే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. నిర్ణీత గడువులోగా రైస్ మిల్లులో యజమానులు తమ లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. గడువులోపు పూర్తిచేసే విధంగా అధికారులు చూడాలని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహణపై అధికారులకు, రైస్ మిల్లు యజమానులకు చౌహాన్ అవగాహన కల్పించారు. వ్యాగన్లు, గోడౌన్ లో స్థలాల కోసం తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైస్ మిల్ యజమానుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. గత యాసంగితో పోలిస్తే ఏడాది ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలిపారు. అంతకు ముందు బిక్కనూరు మండలం బస్వాపూర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మౌలిక వసతుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధికారులు వసతులు ఏర్పాటు చేసినందుకు సంతృప్తిని వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 22,894 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసి 13 కోట్ల రూపాయలు రైతులకు అందజేశామని తెలిపారు. జిల్లాలో గన్ని బ్యాగుల కొరత లేదని చెప్పారు. ప్రతి కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌరసరపర అధికారి మల్లికార్జున బాబు, జిల్లా పౌరసరపర ఇంచార్జ్ మేనేజర్ నిత్యానంద్, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించడం లేదంటూ సర్కారు బడికి తాళం.. కాగజ్‌నగర్‌లో కాంట్రాక్టర్ నిర్వాకం



కాగజ్‌నగర్, ఏప్రిల్ 15: బిల్లులు చెల్లించడం లేదంటూ ఓ కాంట్రాక్టర్ ప్రభుత్వ పాఠశాల గేటుకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు గంటపాటు గేటు బయట వేచి ఉండాల్సి వచ్చింది. ఈ ఘటన సోమవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని పెట్రోల్‌బంకు సమీపంలోగల జడ్పీ సెకండరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో జరిగింది. గత ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు-మనబడి'లో రూ.1.28 కోట్లతో నూత న భవనాలు నిర్మించారు. సదరు కాంట్రాక్టర్ పనులన్నీ పూర్తిచేశాడు. రూ.97 లక్షల బిల్లులు రావా ల్సి ఉంది. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో పాఠశాల గేటుకు తాళం వేశాడు.



## రాష్ట్రంలో మరో పది రోజులు వర్షాలు.. తర్వాత మళ్లీ ఎండల తీవ్రత: వాతావరణ శాఖ

హైదరాబాద్, ఏప్రిల్ 15: రాష్ట్రంలో వచ్చే పది రోజులపాటు ఎండల తీవ్రత తగ్గి.. పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 25 వరకు తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు ఉండవని, సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలి పింది. ఈ నెల 18 నుంచి 25 వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు అంచనా వేసింది.

తర్వాత ఎండల తీవ్రత పెరిగే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఇటీవలి వర్షాల కారణంగా మూడు రోజులు గా కాస్త ఉష్ణోగ్రతలు తగ్గాయి. రాజస్థాన్ మీదుగా నైరుతి రుతుపవనాలు తుఫానుగా మారి కోస్తా కర్ణాటక వరకు వ్యాపించాయని తెలిపింది. మరో ఐదురోజులపాటు హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది.

# మహమ్మద్ అలీ షబ్బీర్‌ను గజమాలతో సన్మానించిన మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి

**వైస్ చైర్మన్ గా ఉరుదొండ వనితా రవికుమార్ పేరు ప్రకటించిన మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రకటన**

**కామారెడ్డి లో నీత్సమస్యతీరుస్తా**

**ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తా**

**ఎన్నికల కోడ్ అనంతరం విలేకరుల పాత్రికేయులకు ఇంటి స్థలాలు సమావేశంలో షబ్బీర్ అలీ వెల్లడి**



కామారెడ్డి బ్యూరో ఏప్రిల్ 15 వాయిస్ టుడే: కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ కౌన్సిలర్ లు సోమవారం రోజు మర్యాద పూర్వకంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ను కామారెడ్డి లోకలిసి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 50 మంది ఓటింగ్ కు 29 ఓట్లు వచ్చాయి.సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో చైర్మన్ గా గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ గా త్వరలోనే ఉరుదొండ వనిత ఎంపిక అవుతారన్నారు. నాలుగేళ్ళ 3 నెలల అవినీతి పాలనకు చరమగీతం పాడాం.మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెడతాం. త్వరలో సీఎం రేవంత్ రెడ్డితో కామారెడ్డి మున్సిపాలిటీ కౌన్సిలర్లతో కలిసి సమావేశమవుతాం. రాబోయే 8 నెలల్లో బెస్ట్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం. మున్సిపాలిటీలో ప్రజలకు సరిపడా నీళ్లు రావడం లేదు, ఎన్నికల తర్వాత సీఎం సమక్షంలో మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం.కామారెడ్డి జిల్లా విలేకరులకు ప్రత్యేకంగా చొరవ తీసుకొని స్థలం,ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత నాది అన్నారు. ఇందిరాగాంధీ స్టేడియంలో 24 గంటల లైటింగ్ సౌకర్యం కల్పించి జాతీయ స్థాయి స్టేడియంకు కావాల్సిన వసతులు కల్పిస్తాం. పట్టణంలో తాను చదువుకున్న ప్రభుత్వ బాలుర పాఠశాల కూలిపోయే స్థితిలో ఉంది. 2-3 కోట్ల వ్యయంతో నూతన పాఠశాల నిర్మాణం చేపడతాం. పాఠశాలకు కావాల్సిన ఇతర వసతులు సొంత డబ్బుతో ఏర్పాటు చేస్తా

కామారెడ్డిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

నూతన రైల్వే బ్రిడ్జిను ఏర్పాటుకు శ్రీకారం చుడతాం రైల్వే అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తాం. 10 వేల కోట్ల మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుతో చేతిలో చిప్ప పెట్టిన కేసీఆర్.

### రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటికే 5 గ్యారెంటీలు పూర్తి చేసాం

90 రోజుల్లో 31 వేల ఉద్యోగాలిచ్చి చరిత్రలో నిలిచాం. ఎన్నికల కోడ్ తర్వాత మరొక 50 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఏడాదిలో లక్ష ఉద్యోగాలు ఇవ్వడమే టార్గెట్ బీఆర్ఎస్ నాయకులు సిగ్గు, శరం లేకుండా మాట్లాడుతున్నారు. ఆకాశంపై ఉమ్మితే మనపైనే పడుతుందని మర్చిపోతున్నారు. 10 సంవత్సరాల్లో బిబిపాటిల్ కేంద్రం నుంచి గాని, రాష్ట్రం నుంచి గాని పైసా పని చేయలేదు. పార్లమెంట్ పరిధిలో ఒక్క మండలం పేరు కూడా ఆయనకు తెలుసా. పార్లమెంటులో ఇక్కడి సమస్యలపై ఒక్కసారి కూడా మాట్లాడలేదు. కనీసం రైల్వే బ్రిడ్జి కూడా మంజూరు తేలేకపోయారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్ కుటుంబ పాలన జరిగింది. ప్రస్తుతం ప్రజా పాలన నడుస్తోంది. నాడు పిసిసి హోదాలో ఫోన్ ట్యాపింగ్ పై చెప్పిన మాటలు నేడు నిజమని తేలాయి కేంద్రం అనుమతి లేకుండా ట్యాపింగ్ చేసి నాయకులు, భార్యాభర్తల మాటలు విన్నారు. నాకున్న సమాచారం ప్రకారం త్వరలో కేసీఆర్ కుటుంబం జైలుకు పోయే అవకాశం ఉంది. మోడీ ఝూటా మాటలు మాట్లాడుతున్నాడు ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే రాష్ట్రానికి మేలు దేశంలో ఇండియా కూటమిని గెలిపించుకుంటాం అన్నారు.